# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక



పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

నమస్తే ఉదయం

నూతన సంవత్సర శుభాకాంక్షలు

HAPPY New Year 2026

ఎడిటర్: ఎం.వనితా రెడ్డి



సంపుటి: 3 | సంచిక: 124 | పేజీలు: 4 | వెల: రూ.4/- | గురువారం 1 జనవరి 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## తెలంగాణ రైజింగ్ విజన్ 2047

# లక్ష్య సాధన దిశగా పయనం

### నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి**

**ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్ష**

**హైదరాబాద్, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కొత్త ఏడాది ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2026 సంవత్సరంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో తెలంగాణ వేగవంతమైన పురోగతిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. నగరంలో వివిధ ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు వినోద కార్యక్రమాలు నిర్వహించి 2026 సంవత్సరం రాగానే పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.





## జానారెడ్డిని పరామర్శించిన

# సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం)**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డిని పరామర్శించారు. ఇటీవల మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్న జానారెడ్డి, ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనకు సంబంధించిన వివరాలను, ఫోటోలను ముఖ్యమంత్రి తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకున్నారు. సీనియర్ నేత ఆరోగ్యం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 1946 జూన్ 20న జన్మించిన జానారెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రిగా, తెలంగాణ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఆయన కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

## కాంగ్రెస్ విధానాలతో

# నేతన్నలకు అన్యాయం

### బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**సిరిసిల్ల, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో నేత కార్మికులకు అన్యాయం జరుగుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సిరిసిల్ల అపారెల్ పార్క్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అపారెల్ పార్క్‌లో తమ హయాంలో వచ్చిన రెండు పరిశ్రమలు మినహా ఇప్పటివరకు కొత్తగా ఒక్కటీ రాలేదని చెప్పారు. 25 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తాము పార్క్ ఏర్పాటు చేశామని కేటీఆర్ చెప్పారు. సంక్రాంతి లోపు వర్కర్ టూ ఓనర్ పథకం లబ్దిదారులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే 10 వేల మందితో నిరసన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, రూ.400 కోట్లతో అపారెల్ పార్క్ ఏర్పాటు చేసిది తామేనని గుర్తుచేశాఃరు. ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదని కేటీఆర్ విమర్శించారు.

# కాంగ్రెస్ ముక్త భారత్ కోసం కృషి

### మా తదుపరి లక్ష్యం తెలంగాణయే: బండి

**హైదరాబాద్, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం)**

బెంగాల్, తమిళనాడు ఎన్నికల తరువాత బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణపైనే దృష్టి సారించబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. ఈసారి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ గెలుపుతో 'కాంగ్రెస్ ముక్త్ భారత్' లక్ష్యాన్ని సంపూర్ణం చేస్తామన్నారు. ఈరోజు కరీంనగర్ లో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీజేపీ నాయకులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు. బీజేపీ కార్యకర్తల త్యాగాలు, పోరాటాలతో కమ్యూనిస్టు కంచుకోట కేరళ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగించిందని గుర్తు చేశారు. బెంగాల్‌లో బీజేపీ కార్యకర్తల ఇళ్లను ధ్వంసం చేస్తున్నా, మహిళా మోర్చా కార్యకర్తలపై అత్యాచారం చేసినా వెనకంజ వేయకుండా అక్కడి ప్రభుత్వంపై బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బెంగాల్ ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టిస్తున్నారని చెప్పారు. హైకమాండ్ దృష్టి అంతా తెలంగాణపైనే ఉందని.. త్వరలో కేంద్రీకృతం చేయబోతోందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.



# ఇంటర్ మ్యాథ్స్‌లో ఇంటర్నల్స్

### వచ్చే ఏడాది నుంచి అమలుకు బోర్డు కసరత్తు

**హైదరాబాద్, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం)**

ఇంటర్మీడియెట్ మ్యాథమెటిక్స్ పరీక్షల విధానం, సిలబస్ లో ఇంటర్ బోర్డు భారీ మార్పులు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'కొత్త లెక్క'లను అమలు చేయబోతోంది. ఇప్పటి వరకు మ్యాథ్స్ పేపర్ అంటే 75 మార్కులకు రాత పరీక్ష ఉంది. వచ్చే ఏడాది నుంచి ఇది మారనుంది. సీబీఎస్ఈ తరహాలో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని తీసుకురావాలని బోర్డు నిర్ణయించింది. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి థియరీ పరీక్షను 60 మార్కులకు కుదించనున్నారు. మిగిలిన 15 మార్కులను 'ఇంటర్నల్స్'కు కేటాయించనున్నారు. అంటే కాలేజీల చేతిలో ఈ 15 మార్కులు ఉండనున్నాయి. విద్యార్థి సామర్థ్యం, ప్రాజెక్టులు, అటెండెన్స్ వంటి అంశాల ఆధారంగా ఇంటర్నల్స్?లో మార్కులు వేస్తారు. దీంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంత తగ్గే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ఒకేలా ఉంది. రెండు పేపర్లకు వచ్చే 150 మార్కులను శాతంగా తీసుకొని వంద మార్కులకు కుదించారు. ఇకపై ఈ విధానానికి చెక్ పడనున్నది. ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ను వంద మార్కులకు నిర్వహించనున్నారు. ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు వేర్వేరుగా ప్రశ్నపత్రాలు

..మిగతా 2లో

## గణతంత్ర వేడుకల్లో తొలిసారి ఆర్మీ

# జంతు బృందం కవాతు

**జనవరి 26న గణతంత్ర వేడుకలో యానిమల్ కంటింజెంట్**

**కవాతులో ఒంటెలు, గొర్రాలు, డేగలు, ఆర్మీ జాగిలాలు**

**కవాతు బృందంలో భద్రత కోసం సైనికులు ఉపయోగించే జంతువులు**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం)**

ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో వచ్చే సంవత్సరం జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకల కవాతులో తొలిసారి యానిమల్ కంటింజెంట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ కవాతులో రెండు ఒంటెలు, నాలుగు గుర్రాలు, నాలుగు డేగలు, పది స్వదేశీ ఆర్మీ జాగిలాలు, ఇప్పటికే సేవల్లో ఉన్న మరో ఆరు జాగిలాలు ఈ బృందంలో ఉండనున్నాయి. మౌంట్ అండ్ వెటర్నరీ కార్ప్స్ (ఆర్వీసీ) విభాగానికి చెందిన శిక్షణ పొందిన జంతువులను ఈ కవాతులో ప్రదర్శించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత సవాళ్లతో కూడిన సరిహద్దుల వద్ద భద్రత కోసం సైనికులు ఉపయోగించే జంతువులు ఈ బృందంలో ఉన్నాయి.

లడఖ్‌లోని శీతల ఎడారులలో కార్యకలాపాల కోసం ఇటీవల చేరిన

..మిగతా 2లో

## హైదరాబాద్ నగరాన్ని అగ్ర స్థానంలో

# నిలపడమే లక్ష్యం

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

**హైదరాబాద్, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం)**

పరిశుభ్రతలో హైదరాబాద్ మహానగరాన్ని అగ్ర స్థానంలో నిలపడమే లక్ష్యంగా 2026లో పనిచేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీ ఆరో ర్యాంకు సాధించిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2 వేల కిలోమీటర్ల వరకు పరిధి విస్తరించిన క్రమంలో 300 వార్డుల నుంచి రోజుకు 9 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు. చెత్త నిర్వహణకు కొత్త డంపింగ్ యార్డుల కోసం భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై 300 వార్డుల్లో నిరంతరం ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తామని వివరించారు. గ్రేటర్‌లో పారిశుద్ధ్యం సహా వివిధ అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలపై సమగ్ర వివరాలు వెల్లడించిన ఆర్వీ కర్ణన్.... వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు



చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జీఐఎస్ సర్వే ద్వారా 14 లక్షల ప్రాపర్టీలను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. అందులో లక్ష మంది.. కట్టాల్సిన ఆస్తి పన్ను కంటే తక్కువగా చెల్లిస్తున్నట్టు గుర్తించామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే నగర పౌరులు తమ ఆస్తి పన్ను నేరుగా జీహెచ్ఎంసీ వెబ్ సైట్, యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. నగరంలో రవాణా సదుపాయం మరింత మెరుగుపర్చేందుకు పెండింగ్ లో ఉన్న ఫ్లైఓవర్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని, హెచ్ సీటీ ప్రాజెక్టు కింద చేపట్టిన 32 ప్రాజెక్టులకు త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్వీ కర్ణన్ ప్రకటించారు.



## కోర్టుకు ఐబొమ్మ రవి

# కస్టడీ రిపోర్టు

### డాలర్ల రూపంలో మూవీ ప్రింట్లకు చెల్లింపులు

**హైదరాబాద్, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం)**


ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టును పోలీసులు బుధవారం కోర్టుకు సమర్పించారు. అందులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రెండు రకాలుగా సినిమా ప్రింట్‌ను రవి కొనుగోలు చేశారు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇక ఐబొమ్మ రవి సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు

# డిప్యూటీ క్యూరేటర్ బర్నోబా
# పదవీ విరమణ జూకు తీరని లోటు

### ఆత్మీయ ఉద్యోగ పదవీ విరమణ వీడ్కోలు సభలో క్యూరేటర్ జె.వసంత, ఐ.ఎఫ్.ఎస్.



బహదూర్ పుర, డిసెంబర్ 31(నమస్తే ఉదయం) జూపార్క్ లో అంకిత భావంతో పని చేసే అధికారి పదవీ విరమణ చేయడం లోటుగానే భావిస్తున్నట్లు క్యూరేటర్ జె. వసంత అన్నారు. కుటుంబాని కంటే అధిక సమయం సుమారు 38 ఏళ్ల 10 నెలల కాలం పాటు అటవీ శాఖకు ఇవ్వడం, చివరి ఏడాదిన్నర కాలంలో డిప్యూటీ క్యూరేటర్ గా జూలోని వన్యప్రాణుల సంరక్షణ పట్ల ఆయన శ్రద్ధపూర్వక విధి నిర్వాహణ అభినందనీయమని ఆమె కొనియాడారు. డిప్యూటీ క్యూరేటర్ బర్నోబా ఆత్మీయ ఉద్యోగ పదవీ విరమణ వీడ్కోలు సభను బుధవారం జూలోని బయోస్కోప్ హాల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూ సిబ్బంది , అధికారులతో పాటు జూనియర్ అసిస్టెంట్ స్థాయి నుంచి వివిధ హోదాల్లో బర్నోబా పని చేసిన ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ఎల్లారెడ్డి, మెదక్, నాగర్ కర్నూల్, వికారాబాద్ తదితర జిల్లాలు, ప్రాంతాల నుంచి సహ ఉద్యోగులు తరలి వచ్చారు. డిప్యూటీ క్యూరేటర్ బర్నోబా దంపతులు ఇద్దరు వేర్వేరు శాఖలలో ప్రభుత్వ అధికారులు కావడంతో వారి సర్వీసులో జరిగిన కుటుంబ దూర , బారాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం వీడ్కోలు సభకు హాజరైన ప్రతి ఒక్కరిలో ఆనంద బాష్పాలను తీసుకువచ్చాయి. ఓ అధికారి అనతీ కాలం పని చేసి పదవీ విరమణ చేసిన చోట ఆయన ఉద్యోగ ధర్మం పట్ల చూపిన శ్రద్ధను, సదరు సీనియర్ అధికారి నుంచి నేర్చుకున్న కర్తవ్య నిర్వాహణ బాధ్యతలను ఒక్కొక్కరుగా జూ ఉద్యోగులు సభలో వివరించడం అందరిలో వారి సేవల్లోని మంచి తనాన్ని , నేర్పరి తననాన్ని గుర్తు చేసిందని చెప్పాలి. కాగా వీడ్కోలు ప్రసంగంలో డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ హకీమ్ కంట తడి పెట్టం అందరిని కలచి వేసింది. ఈ కార్యక్రమంలో జూ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎఓ ఎం. రవి కుమార్, అసిస్టెంట్ క్యూరేటర్లు నజియా తబస్సుమ్, లక్ష్మణ్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ ఖుద్దూస్, సీనియర్ అసిస్టెంట్ లియాకత్ హుస్సెన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు మాదవీలత, ఎఫ్ఎస్ఓలు మంజుల, వెంకట్ రావు, పార్క్ సూపర్వైజర్ మోహన్ రెడ్డి, , జూ జీవశాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణ, పిఆర్ఓ హెచ్.ఎం. హనీఫ్, జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ దీపక్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



## శాసనసభాపక్ష బిఆర్ఎస్ పార్టీ ఉపనేత హరీష్ రావును కలిసిన బొల్లారం బిఆర్ఎస్ నేతలు

పటాన్ చెరు, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం): శాసనసభ లో ప్రతిపక్ష పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా నియమితులైన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ని మరదపూర్వకంగా కలిసి బొల్లారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి నేతృత్వంలో బొల్లారం డివిజన్ బిఆర్ఎస్ నాయకులు హరీష్ రావు ను కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. హరీష్ రావును కలిసిన వారిలో జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.



## అమీన్‌పూర్ డిప్యూటీ కమీషనర్ ప్రదీప్ కుమార్‌ను కలిసిన పారిశ్రామిక వేత్తలు

### పారిశ్రామిక ప్రాంతంలో సమస్యలపై చర్చ

పటాన్ చెరు, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం): నూతనంగా అమీన్ పూర్ డిప్యూటీ కమిషనర్ గా నియమితులైన ప్రదీప్ కుమార్ ని కలిసి బొల్లారం డివిజన్ పారిశ్రామిక వేత్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పారిశ్రామిక ప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు ఇతర సమస్యల గురించి చర్చించారు.పారిశ్రామక ప్రాంతంలో సానిటరీ డ్రైవ్ రాబోయే 2 నుంచి 3 రోజుల్లో అమలు చేయబడుతుందని డిప్యూటీ కమీషనర్ చెప్పారు. అన్ని పరిశ్రమలు తమ బయటి ప్రాంగణాలను స్వచ్ఛందంగా శుభ్రం చేయాలని కోరారు. లేని పక్షంలో భారీ జరిమానాలు విధించడం జరుగుతుంది అన్నారు. కుక్క కాట్లు మరియు చైన్ స్నాచింగ్ సమస్యలు గురించి కూడా ఈ సందర్భంగా చర్చించారు.పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న అన్ని అక్రమ ఆక్రమణలు తొలగించబడతాయని కమీషనర్ చెప్పారు. ముఖ్యంగా అసానికుంట సమస్య పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని సూచించారు. పారిశ్రామిక వేత్తలకు ఏవైనా ఆందోళనలు ఉంటే, వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. డిప్యూటీ కమీషనర్ ను కలిసిన వారిలో బొల్లారం ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద రావు,జెనెక్స్ పరిశ్రమ ప్రతినిధి రాయుడు ఉన్నారు.



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

## దళిత సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

బుద్వేల్, డిసెంబరు 31 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ మాజీ అధ్యక్షులు గుడిసె యాదయ్య, పచ్చ నర్సింగ్ రావు , పంబాల రాజు, దళిత నాయకులు గొడుగు సంజీవ, సత్యార నర్సింహ్మా, నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు మంగళారం శ్రీనివాస్, కావలి అనంతరాం, ఎస్ పెంటయ్య, పెండ్యాల జంగయ్య, బచ్చుల రాజు, నిమ్మల మురళి, వెంకటేశ్, సంజు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ మ్యాథ్స్‌లో ఇంటర్నల్స్

మొదటి పేజీ తరువాయి...

రూపొందించనున్నారు. కామర్స్ బ్యాక్ గ్రౌండ్ ఉండే ఎంఈసీ వాళ్లకు వారి స్జబెక్టులకు ఉపయోగపడేలా మ్యాథ్స్ సిలబస్ ను రూపొందించనున్నారు. అలాగే, పరీక్షల విధానంతో పాటు సిలబస్ లోనూ మార్పులు జరగనున్నాయి. ప్రస్తుతం మ్యాథ్స్ బీలోనే ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నారు. దీన్ని గమనించిన ఇంటర్ బోర్డు.. మ్యాథ్స్ బీ పాఠ్య పుస్తకంలోని కొన్ని కఠినమైన చాప్టర్లను మ్యాథ్స్ ఏలోకి మార్చాలని డిసైడ్ అయింది. ఈ మార్పులన్నీ వచ్చే విద్యా సంవత్సరం నుంచే పక్కాగా అమలు కానున్నాయి.

## గణతంత్ర వేడుకల్లో తొలిసారి ఆర్మీ జంతు బృందం కవాతు

మొదటి పేజీ తరువాయి...

బాక్ట్రియన్ ఒంటెలు ఈ కవాతులో నాయకత్వం వహించనున్నాయి. విపరీతమైన చలి, 15,000 అడుగుల కంటే ఎత్తులో అసాధారణ పరిస్థితుల్లో ఈ ఒంటెలు 250 కిలోల వరకు బరువును మోయగలవు. అదే సమయంలో తక్కువ నీరు, ఆహారంతో ఎక్కువ దూరం కూడా ప్రయాణించగలవు.

## కోర్టుకు ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టు

మొదటి పేజీ తరువాయి...

పంపినట్లు పోలీసులు అతడి ద్వారా తెలుసుకున్నారు. అయితే ఈ నగదు లావాదేవీలన్నీ ఐబొమ్మ రవి డాలర్ల రూపంలోనే చేసినట్లు గుర్తించారు. ఇక రాకేష్ అనే వ్యక్తి ద్వారా ట్రైడ్ మార్క్ లైసెన్స్, బెట్టింగ్, పైరసీ ద్వారా వచ్చిన నగదుతో రవి జల్సాలు చేసినట్లు పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోనే రవి ఆఫీస్ నడిపినట్లు కస్టడీ రిపోర్టులో పోలీసులు స్పష్టం చేశారు. దాదాపు 12 రోజుల కస్టడీ అనంతరం మంగళవారం అతడిని జైలుకు పోలీసులు తరలించారు. ఈ కస్టడీలో ఐ బొమ్మ రవి కీలక అంశాలు వెల్లడించారు. వాటిని తమ కస్టడీ రిపోర్టులో పొందుపరిచిన అంశాలను కోర్టుకు పోలీసులు అందజేశారు. ఈ మొత్తంలో దాదాపు రూ. 10 కోట్లు విలాసవంతంగా గడపడానికి ఖర్చు చేశాడు. హై÷ పబ్‌లు, ÷వ్ స్టార్ హోటళ్లలోనే బస చేయడం ద్వారా లగ్జరీ లైఫ్ ఎంజాయి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. ప్రస్తుతం రవి అకౌంట్‌లో రూ. 3 కోట్ల నగదును పోలీసులు ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.



వాలీబాల్ పోటీలలో పాల్గొన్న యువత

## యువత మత్తు వైపు కాకుండ క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

బుద్వేల్, డిసెంబరు 31 (నమస్తే ఉదయం) : యువత మత్తు వైపు కాకుండ క్రీడల వైపు దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతో డిసెంబరు 31వ తేదీన రాత్రి మైలార్దేవుపల్లి సారధి యువజన సంఘ ం ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించినట్లు సంఘం అధ్యక్షులు సంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తెలి పారు. బుధవారం రాత్రి సారధి యువజన సంఘం ఆధ్వర్యంలో యువత కు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొప్పుల నవీన్ గౌడ్, ఎస్ మహేందర్ రెడ్డి , ఎన్ను శంకర్ రెడ్డి, ఎస్ శశికాంత్ రెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, సంరెడ్డి మహేశ్వర్ రెడ్డి , నవారు చెన్న రెడ్డి, నోముల విట్టల్ యాదవ్, కొప్పుల కిషోర్ గౌడ్ , కొప్పుల లక్ష్మన్ గౌడ్ , కొప్పుల రోషన్ గౌడ్, కొప్పుల సాకేత్ గౌడ్ , అక్కెం సంపత్ యాదవ్ , గడ్డం సందీప్ యాదవ్, బుర్రోలు సాయ్ కుమార్, పీ. సతీష్ రెడ్డి , తాటిపాముల శివ గౌడ్, ఎన్ను కార్తిక్ రెడ్డి , ఎండపల్లి సంతోష్ రెడ్డి, పసుల రవీందర్ , లింగాల సంతోష్ గౌడ్, కె . ఉషాకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పౌర హక్కుల దినోత్సవం లో పాల్గొన్న అధికారులు, పౌరులు


## రాజేంద్రనగర్‌లో పౌర హక్కుల దినోత్సవం

బుద్వేల్, డిసెంబరు 31 (నమస్తే ఉదయం) : పౌరుల హక్కులను హరించే విదంగా ఎవరు ప్రవర్థిం చవద్దని రాజేంద్రనగర్ మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ లు సునీతారెడ్డి, సరిత లు అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం రాజేంద్రనగర్ వార్డు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంటరాని తనం నేరం అని, అన్ని వర్గాల ప్రజలు కలసి మెలసి ఉండాలన్నారు. అంటరాని వాళ్లని ఎవరినైనా దేవాలయాలలోకి రాకుండ చూస్తే తమ దృష్టికి తీసుకురవాలన్నారు. రెండు గ్లాసుల పద్ధతిని ఎవ్వరు పాటించవద్దన్నారు. రాజ్యాంగం ప్రకారం పౌరులకు ఉండాల్సిన హక్కులను హరించాలని చూస్తే చట్టపరంగా శిక్షలు తప్పవన్నారు. అలాంటి సంఘటనలు జరిగితే రాజేంద్రనగర్ తహసీల్దార్ బి రాములు సెల్ 9849904231 నెంబర్ కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి , వార్డెన్ మహ్మద్ గౌసుద్దీన్, స్థానిక నాయకులు కోరని సదానంద్, మంగళారం శ్రీనివాస్, పంబాల రాజు, వీర్లపల్లి నవీన్, పచ్చ అనిత, పచ్చ నర్సింగ్ రావు , కోరని క్రాంతి, ఈ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జయశంకర్ వర్సిటీ అభివృద్ధికి రూ. 500 కోట్లు కేటాయించాలి


### టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్

బుద్వేల్, డిసెంబరు 31 (నమస్తే ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మౌళిక సదుపాయాల కల్పన కోసం రూ.500 కోట్లను మంజూరు చేయించాలని కోరుతు టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ ఆసోసియేషన్ ప్రతినిధులు బుధవారం వ్యవసాయ శాఖ మం త్రి తుమ్మల నాగేశ్వరరావు ను బంజారహిల్స్ లోని ఆయన నివాసం లో కలసి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలసిన వారిలో తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) ఉపాధ్యక్షులు డాక్టర్ జె కమలాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎం రమేశ్, వర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ జయరాం, సంయుక్త కార్యదర్శి జి. పరమేశ్, సాంకేతిక కార్యదర్శి సులోచన, కార్యనిర్వాహక కార్యదర్శి రవీందర్ రెడ్డి లు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నూతన వ్యవసాయ కళాశాలల నిర్మాణం, నిర్వహణ కోసం నిధులు



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలను కలసిన వ్యవసాయ వర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రదినిధులు

కేటాయించాలన్నారు. బాలుర, బాలికల వసతి గృహాలను నిర్మించాలన్నారు. కొత్త టెక్నాలజీల ల్యాబ్ లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయానికి కొత్త పనిముట్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరిశోధన కేంద్రాల అధునీకరణ కోసం నిధులు కేటాయింటాలని విజషి చేశారు. ఉద్యోగులు ఉండటానికి క్వార్టర్స్ నిర్మించాలన్నారు. కృతిమ మేధ ల్యాబ్ లలో



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను కలిసి సన్మానిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర సంఘాల ప్రతినిదులు

కొత్త పరికరాలు, నూతన లాబోరేటరీలను నిర్మించాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, నిధులు లేక పోవడంతో అనుకున్నంత మేరకు అభివృద్ధి చేయలేకపోతున్నారన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున విశ్వవిద్యాలయంలో మౌళిక సదుపాయాలను కల్పించాలన్నారు. వర్సిటీ కి బడ్జెట్ లో ఎక్కువ కేటాయింపులు చేయాలన్నారు.

**హెల్త్ కార్డులు ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా ను కలసిన ఉద్యోగులు :**

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ కు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరుతు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా ను కలసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇస్తున్నారని, విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వడం లేదన్నారు. తమకు కూడా హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. దానికి స్పందించిన చిన మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా జనవరి 5వ తేదీన హెల్త్ కార్డులపై సమావేశం ఉందని, ఆ రోజు మీరు వచ్చి మీ సమస్యలను తెలియజేయాలని కోరారు. సాధ్యమైనంత మేరకు ప్రతి ఉద్యోగికి హెల్త్ కార్డు ఇవ్వడమే ప్రభుత్వ ఉద్దేశం అని గుర్తు చేశారు.

# పురపాలికల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్



గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31(నమస్తే ఉదయం) పురపాలికల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగానే సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ ఎన్నికలు, పురపాలికల్లో అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా పురపాలికల్లో ఉన్న వార్డుల వారీగా ఓటర్ల ఫైనల్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పబ్లిష్ చేసేందుకు అవసరమైన ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా రెండు, మూడు వార్డులకు కలిపి ఒక రిటర్నింగ్ అధికారిని నియమించాలన్నారు. ఒక్కో వార్డులో 850కు పైగా ఓటర్లు ఉంటే రెండు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా పురపాలికల్లో ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బంది స్థానికులు కాకుండా ఇతర మండలాల వారిని నియమించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై కలెక్టర్ సమీక్షిస్తూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా మంజూరైన ఇండ్లన్నీ వంద శాతం నిర్మాణ దశలోకి వెళ్లే పూర్తి బాధ్యత ఆయా మున్సిపల్ కమిషనర్లదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇండ్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు జనవరి 6లోగా అన్ని అనుమతులు పూర్తయి మార్కౌట్ చేసి ఇస్తే పునాదులు నిర్మించుకోవచ్చన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ వేగవంతం కావడానికి సంబంధిత వార్డు అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. గద్వాల, ఐజ, వడ్డేపల్లి, అలంపూర్ పురపాలికల్లో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంతో ఎన్నికల కోడ్ వచ్చేలోగానే టెండర్ పూర్తయి పనులు ప్రారంభించేలా మొత్తం ప్రక్రియను సంబంధిత ఇంజనీర్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీసీ రహదారులు, మురుగు కాలువలు, పార్కులు, జంక్షన్ల అభివృద్ధి, తదితర పనులు చేస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో స్థలం సమస్య లేకుండా సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఆయా అభివృద్ధి పనులకు టెక్నికల్ శాంక్షన్ పూర్తి చేసుకుంటే మిగిలిన ప్రక్రియ వేగవంతం అవుతుందన్నారు. అన్ని పురపాలికల్లో జనవరి 20వ తేదీలోగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభం కావాలని, అలసత్వం వహించే ఇంజనీర్లపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హౌ సింగ్ పిడి శ్రీనివాసరావు, జెడ్పి డిప్యూటీ సీఈవో నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్లు జానకి రామ్ సాగర్, శంకర్



# రైతులకు ప్యాగ దూడల పోషణ, సంరక్షణపై అవగాహన

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం) భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ కి సంబంధించినమైండ్ ట్రీ ఫౌండేషన్ సహకారంతో గట్టు మండలం ఎల్లం దొడ్డి గ్రామంలో ప్యాగ దూడల పోషణ, సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు జోగులాంబ గద్వాల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి శివానంద స్వామి గా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రైతులను ఉద్దేశించి ప్యాగదూడల సంరక్షణ మరియు సస్యరక్షణ వాటి పోషణ తదితర అంశాలపై రైతులకు సలహాలు సూచనలు చేశారు. భవిష్య భారత్ ఫౌండేషన్ వారి సహకారంతో మెడిసిన్ కిట్లను రైతులకు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి శివానంద స్వామి అందజేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఫౌండేషన్ వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి వరలక్ష్మి. డాక్టర్ సిహెచ్ నవీన్ చంద్ర. ఎల్ ఎస్ ఎ, పృధ్వీరాజ్ గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నార



మున్సిపల్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్

# ఓటరు జాబితాల్లో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31(నమస్తే ఉదయం): జనగామ మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న ఎన్నికల సంబంధిత పనులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పింకేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా. ఓటర్ల వార్డ్ మ్యాపింగ్, పోలింగ్ స్టేషన్ మ్యాపింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. ఓటరు జాబితాల్లో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి వార్డుకు సంబంధించిన ఓటర్ల వివరాలు సక్రమంగా మ్యాప్ కావాలని, ఎన్నికల నిర్వహణకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని అధికారులకు స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ స్టేషన్ వారీగా ఉన్న ఓటరు డేటాను మున్సిపాలిటీ పరిధిలో వార్డు వారీగా పునర్వ్యవస్థీకరించే ప్రక్రియను అధికారులు సమగ్రంగా సమీక్షించారు. డేటా ఖచ్చితత్వం, పారదర్శకత, భవిష్యత్తు ఎన్నికల నిర్వహణకు అనువుగా ఉండే విధంగా ఈ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఎన్నికల ఏర్పాట్లలో పారదర్శకత, సమర్థత అత్యంత కీలకమని పేర్కొన్నారు.





బహుమతులు అందుకుంటున్న సిబ్బంది

# ఐఐఆర్ఆర్‌లో ముగిసిన స్వచ్ఛ ఫక్వాడ

బుద్వేల్, డిసెంబరు 31 (నమస్తే ఉదయం) : ప్రతి ఒక్కరు స్వచ్ఛ ఫక్వాడ పట్ల అవగాహన కలిగి తాము నివాసం ఉంటున్న పరిసరాలు, పనిచేస్తున్న కార్యాలయాలలో పరిశుభ్రత ను పాటిస్తే ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతమైన జీవితాన్ని జీవించడానికి అవకాశం ఉంటుందని రాజేంద్రనగర్ లోని భారతీయ జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, ముఖ్య పరిపాలన అధికారి శితాంశు కుమార్ లు అన్నారు. ఐఐఆర్ఆర్ స్వచ్ఛ ఫక్వాడ నోడల్ అధికారి డాక్టర్ చిన్న బాబు నాయక్ నేతృత్వంలో రెండు వారాల పాటు నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమాలు బుధవారం ముగిసాయి. విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను, వివిధ రకాల పోటీలను నిర్వహించారు. స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం విజయవం తం చేయడానికి సహకరించిన పలువురికి బహుమతులు అందజేశారు. ప్లాస్టిక్ కు బదులు బట్ట సంచులు, జ్యూట్ బ్యాగులను ఉపయోగించాలని సూచించారు. హనుమాన్నగర్, పిడెంపల్లి, శీలంపల్లి, పాలమాకుల, కిస్మత్పూర్, హైదరూడ బస్తీలలో స్వచ్ఛ ఫక్వాడ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. ఐఐఆర్ఆర్ క్యాంపస్ ను ప్లాస్టిక్ రహిత క్యాంపస్ గా ప్రకటించారు. రెండు వారాల పాటు జరిగిన స్వచ్ఛత ఫక్వాడ కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయని, అనేక మందికి అవగాహన కల్పించడానికి దోహద పడ్డాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు. ఉద్యోగులు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛ ఫక్వాడ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు

# బొకేలు, పుష్ప గుచ్ఛాలు, శాలువాలు వద్దు

## పేద విద్యార్థుల కోసం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, దుప్పట్లు తీసుకు రండి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31(నమస్తే ఉదయం): నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చే వారు బొకేలు, పుష్ప గుచ్ఛాలు, శాలువాలు తీసుకొని రావద్దని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటన లో పిలుపు నిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు.. బొకేలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజమని, అయితే వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, దుప్పట్లు తీసుక రావలిసిందిగా కలెక్టర్ సూచించారు. పేద విద్యార్థులకు చేదోడువాదోడుగా నిలవాలని, వాటిని త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పేద పిల్లలకు విద్యా సామాగ్రి ఇవ్వడం ద్వారా పిల్లల చదువుకు ఉపయోగ పడుతాయని, చలి కాలం దుప్పట్లు అందిచడం వలన వారి ఆరోగ్యరక్షణకు ఉపయోగపడతాయని తెలిపారు.



# తాగునీటి సమస్య తీర్చండి సారూ.. జోగన్ గట్టులో తీవ్రమైన ఇబ్బందులు

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 31(నమస్తే ఉదయం) తాగునీటి సమస్య తీర్చండి సారూ అంటూ గట్టు మండల జోగన్ గట్టు గ్రామానికి చెందిన పలు కాలనీవాసులు కాళీ బిందెలతో నిరసన తెలిపారు. తారాపురం మేజర్ పంచాయతీలో గల జోగన్ గట్టు గ్రామంలో సుమారు 300 జనాభా ఉంది. గత వారం రోజుల నుంచి గ్రామంలో పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ త్రాగునీరు అందడం లేదని గ్రామస్తులు వాపోయారు.మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కొరకు వ్యవసాయ పొలాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామానికి నీటి సరఫరా లేకపోవడంతో విషయాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమాచారం తెలిపినట్లు గ్రామానికి చెందిన శివమ్మ, గొవిందమ్మ, బీములమ్మ, నర్సమ్మ, కొండమ్మ, తిములమ్మ, సుజాత, ఉరుకుందమ్మ, జయమ్మ, పాగుంటమ్మ, కములమ్మ, వీరేష్, హనుమంతు, చిన్న వీరేష్ తెలిపారు. కూలిపని వదిలేసి ఇక్కడే తాగునీటి కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎలక్షన్ టైమ్ లో అది చేస్తాం ఇది చేస్తామని లీడర్లు ప్రగలబ్బాలు పలుకుతున్నారు కాని గ్రామంలో త్రాగు నీటి సమస్య తీర్చలేకపోతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామానికి అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని ఎలక్షన్లు టైం తప్పితే మిగతా సమయంలో ఎవరు కూడా సందర్శించిన దాఖలు లేవన్నారు. పొద్దున లేచి నుండి సాయంత్రం వరకు నీటి కోసం అష్ట కష్టాలు పడుతున్నామని, అధికారులు ఒకసారి పర్యవేక్షించి నీటి సమస్యను తీర్చాలని కోరారు.త్రాగు నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ నాయక్ ను వివరణ కోరగా తారాపురం గ్రామం పంచాయతీలో గల జోగన్ గట్టు గ్రామం ఎత్తులో ఉండటంతో ట్యాంకుకు నీళ్లు అందడంలేదని, తారాపురం గ్రామంలో ఉన్న మూడు ప్రభుత్వ పాఠశాలలకు త్రాగు నీటిని వదలడంతోనే జోగన్ గట్టుకు నీరు అందడం లేదన్నారు. అవసరం వచ్చినప్పుడు మిషన్ భగీరథ నీళ్లు ఉన్న వాల్ తిప్పడం వల్ల ఇతర గ్రామాలకి వెళ్లడం లేదన్నారు. సమస్యను పరిష్కరించి త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

# గుట్టుచప్పుడు కాకుండా చెరువులో నిర్మాణం

## పిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



పటాన్ చెరు, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం): రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయం పిర్యాదు అందుకున్న అధికారులు చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేయడంతో కబ్జాదారులు బరితెగించి నిర్మాణాలు చేపడుతున్నారు. బొల్లారం డివిజన్ పరిధిలోని కిష్టం కుంట చివరి నాలా పై ఇంటి నిర్మాణం జరుగుతోందని ఇప్పటికే ఇరిగేషన్, అప్పటి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. పిర్యాదు అందుకున్న అధికారులు చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కించడంతో నిర్మాణం పనులు పూర్తి అయ్యాయి. భారీ వర్షాల సమయంలో ఇప్పటికే ఆ ప్రాంతం ముంపుకు గురౌతోంది. ఇలాంటి దశలో నాలా కబ్జాకు గురికావడం వల్ల తీవ్ర ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు

# అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను కలిసిన బొల్లారం బిజెపి నాయకులు



పటాన్ చెరు, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం): ఇటీవల అమీన్ పూర్ డిప్యూటీ కమీషనర్ గా ప్రదీప్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బొల్లారం డివిజన్ బిజెపి అధ్యక్షుడు కేజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు డిప్యూటీ కమీషనర్ ప్రదీప్ కుమార్ ను కలిసి ఘనంగా సన్మానించారు. బొల్లారం డివిజన్ పరిధిలో చిలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న ముఖ్యమైన సమస్యలు సాధ్యమైనంత త్వరితగతిన పూర్తి చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ కమీషనర్ ను కలిసిన వారిలో బిజెపి నాయకులు టి రవీందర్ రెడ్డి, మేఘనా రెడ్డి, యశ్వంత్, శ్రీకాంత్ చారి, అఖిల్ తదితరులున్నారు

# ప్రజావసరాలకు అనుగుణంగా నూతన పోలీస్ స్టేషన్లు, సబ్ డివిజన్లు

### పటాన్ చెరు లో ఏసిపి కార్యాలయం ఏర్పాటు చేయాలని

### డిజిపి శివధర్ రెడ్డిని కోరిన పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



డిజిపి శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం): ప్రజావసరాల మేరకు పోలీసు సేవలు అందించేందుకు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ డిజిపి శివధర్ రెడ్డికి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరొంది శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో నూతనంగా చేపడుతున్న పోలీస్ స్టేషన్ల విభజన ప్రక్రియను ప్రజల అవసరాలకు, అభిప్రాయాలకు అనుగుణంగా చేపట్టాలని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డిని మహిపాల్ రెడ్డి కోరారు. బుధవారం ఉదయం హైదరాబాదులోని డీజీపీ కార్యాలయంలో డిజిపి శివధర్ రెడ్డితో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను డిజిపి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా.. పటాన్ చెరు నియోజకవర్గ కేంద్రంగా పనిచేయాల్సిన ఏసిపి కార్యాలయాన్ని.. ఆర్సీపురం పేరుతో ఆర్ సి పురం కేంద్రంగా ఏర్పాటు చేశారని దీని మూలంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. పటాన్ చెరు పట్టణంలో జాతీయ రహదారికి ఆనుకొని ప్రజలందరికీ అనువుగా అధునాతన సౌకర్యాలతో ఇటీవల 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో డీఎస్పీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని పనులు సైతం ప్రారంభమయ్యాయని డిజిపి కి తెలిపారు. నూతన భవనంలో పటాన్ చెరు పేరుతో ఏసిపి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు పోలీస్ స్టేషన్ ను నార్సింగి ఏసిపి కార్యాలయం పరిధిలోకి చేర్చారని రామచంద్రపురం ఏసిపి పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్ కి బదులుగా కొల్లూరు పోలీస్ స్టేషన్ ను చేర్చాలని కోరారు. దీని మూలంగా పరిపాలనా పరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని తెలిపారు. మినీ ఇండియా గా పేరుందిన బొల్లారం పోలీస్ సర్కిల్ కార్యాలయం తో పాటు పోలీస్ స్టేషన్ ను రద్దు చేసి.. బొల్లారం డివిజన్ ను పూర్తిగా అమీన్పూర్ పోలీస్ సర్కిల్ పరిధిలోకి చేర్చారని.. దీని మూలంగా స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు ఏర్పడబోతున్నాయని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమల సైతం బొల్లారం పరిధిలో పనిచేస్తున్నాయని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే బొల్లారం పరిధిలో 17వేల చదరపు అడుగుల సామర్థ్యంతో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులు సైతం కొనసాగుతున్నాయని తెలిపారు. బొల్లారం పరిధిలోని పోలీస్ స్టేషన్ ను యధావిధిగా కొనసాగించాలని కోరారు. పటాన్ చెరు కేంద్రంగా పనిచేసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ విభజన ప్రక్రియలో ఇస్నాపూర్ పరిధిలోకి వెళ్లడం జరిగిందని పటాన్ చెరు కేంద్రంగా నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన డీజీపీ శివధర్ రెడ్డి త్వరలోనే ఇందుకు సంబంధించి సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.



ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

## విధి నిర్వహణలో స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి

### ఉపాధ్యాయుడిని సన్మానించిన తోటి ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్ , డిసెంబర్ 31(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి విధి నిర్వహణలో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఏడాది పొడవున ఒక్క లీవ్ తీసుకోకుండా విధులు నిర్వహించి విధుల పట్ల తనకున్న అంకితభావాన్ని చాటుకున్నారు. బుధవారం పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీను నాయక్, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీనివాస్ రెడ్డి ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఉపాధ్యాయుడు పనిచేస్తే పాఠశాలకు మెరుగైన ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. శ్రీనివాస్ రెడ్డి లాంటి ఉపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పాఠశాలు మరింత అభివృద్ధి సాధిస్తాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరళమ్మ, రూపా దేవి, జనార్ధన్ చారి, సుదర్శన్, వెంకటయ్య, సుధాకర్, పరమేష్, నరసింహ చారి, మొగులయ్య, కృష్ణకుమార్, ప్రమిద, ఉదయలక్ష్మి, వసుంధర, సులక్షణ, కవిత పద్మ, భారతి, శ్రీదేవి, ప్రభాకర్, సంధ్య, సిద్ధప్ప, స్వాతి , మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



## బొల్లారం డివిజన్‌లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఆగినట్టేనా...!

పటాన్ చెరు, డిసెంబర్ 31 (నమస్తే ఉదయం): మున్సిపల్ పరిధి నుంచి జిహెచ్ఎంసి పరిధిలోకి బొల్లారం మున్సిపల్ ప్రాంతం పునర్విభజనకు మునుపు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రారంభంలో హడావుడి చేసిన అధికారులు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయకుండానే మధ్యస్థంగా నిలిచిపోయాయి. ముఖ్యంగా బొల్లారం ప్రధాన రహదారి నుండి గండి గూడెం కాలనీ వరకూ రోడ్డు గతనెల విస్తరణ పనులు చేపట్టారు అప్పటి మున్సిపల్ కమీషనర్ బి కిషన్. రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. దీంతో కొంతమంది ఇంటి యజమానులు, వ్యాపార సంస్థలు కొన్ని నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించారు. ఈలోగా బొల్లారం మున్సిపల్ ప్రాంతాన్ని జిహెచ్ఎంసి లో విలీనం చేస్తున్నట్లుగా ప్రకటన విడుదల కావడంతో రోడ్డు విస్తరణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో స్వచ్ఛందంగా తొలగించుకోవడానికి ముందుకు వచ్చిన వారు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. కొందరు యధాతథంగా ఆక్రమణలో ఉండగా వారిపై చర్యలు లేకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. రోజురోజుకూ రహదారి పై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈనేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



## మేడ్చల్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### కౌడే మహేష్ కురుమ

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మేడ్చల్ మున్సిపాలిటి ) డిసెంబర్ 31 ( నమస్తే ఉదయం ):-మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌడే మహేష్ కుర్మ మేడ్చల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కౌడే మహేష్ కుర్మ మీడియతో మాట్లాడుతూ మేడ్చల్ మున్సిపాలిటీ, ఉమ్మడి మేడ్చల్ మండల, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో అభివృద్ధి వెలుగులు నింపాలని ఆకాంశిస్తు, మీరు తలపెట్టిన పనులన్నీ దిగ్విజయం కావాలని ఈ నూతన సంవత్సరం మీకు అంతా మంచే జరగాలని, ఈ నూతన సంవత్సరంలో మీకు భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మీ జీవితాలు సుఖసంతోషాలతో నిండాలని భగవంతున్ని కోరారు. తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ జిల్లా ఉమ్మడి మేడ్చల్ మండల మేడ్చల్ మున్సిపాలిటీ ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, అనధికారులకు పురప్రముఖులకు, నాయకులకు, కార్యకర్తలకు, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా,అపోలీస్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు, ప్రజలందరికీ, మిత్రులకు శ్రేయోభిలాషులకు ప్రతి ఒక్కరికీ ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.




## భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్వేచ్ఛ హక్కు

### శాంతి శ్రీనివాస్ రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) డిసెంబర్ 31 ( నమస్తే ఉదయం ):- భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్వేచ్ఛ హక్కును అందరూ పొందాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాసరెడ్డి ఉన్నారు. బుధవారం అల్వాల్ డివిజన్ పరిధిలో అల్వాల్ మండల డిప్యూటీ తాసిల్దార్ పృధ్వి ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల చివరి రోజు నిర్వహించే పౌర హక్కుల దినం రోజున పలు సమస్యలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. సమానత్వ హక్కు స్వేచ్ఛ హక్కు భారత రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలపై చర్చించారని ఆమే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఎంసి హేమలత, ఆర్ ఐ రమ్యశ్రీ, ఎస్ట్రు మల్లేష్, శరణ్ గిరి, రాజు, పోచయ్య, నాగరాజు, లింగారెడ్డి, సాజిద్ అంజయ్య, జయరామారావు, పరమేష్, వీరమని, కమలమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## సమాజ సేవలో పాస్టర్ల పాత్ర గణనీయమైనది

### ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఎస్ రావు నగర్ డివిజన్ ) డిసెంబర్ 31 ( నమస్తే ఉదయం ):-సమాజ సేవలో పాస్టర్ల పాత్ర గణనీయ మైనదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాస్టర్లకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతులు మీదుగా పాస్టర్లకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ సేవలో పాస్టర్ల పాత్ర గణనీయమైనదని అన్నారు. సమాజ సేవలో ముందుండే పాస్టర్లు ప్రజల మధ్య ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తాను ముందుకు వెళ్తున్నాను అని చెప్పారు. అవసరమైన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక నాయకులు, క్రైస్తవ సంఘం ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ నగర్ నుండి చెన్నపురం వరకు ప్రత్యేక డివిజన్గా ప్రకటించాలి



మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( జవహర్ నగర్ అంబేద్కర్ నగర్ ) డిసెంబర్ 31 ( నమస్తే ఉదయం ):- అంబేద్కర్ నగర్ నుండి చిన్నపురం వరకు ప్రత్యేక డివిజన్ గా ప్రకటించాలని సంఘ సేవకులు జింక నాగేశ్వర్ రావు ఉన్నారు. బుధవారం జింక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ఐటి మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జవహర్నగర్ పరిధిలోని అంబేద్కర్ నగర్ నుండి చెన్నపురం వరకు ఉన్న సుమారు 50 కాలనీలను కలిపి ఒక ప్రత్యేక గ్రేటర్ హైదరాబాద్ డివిజన్గా ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించినట్లు చెప్పారు. స్థానిక నాయకులు కాలనీవాసుల బృందం మేడ్చల్ మల్కాజిగిరి ఇంచార్జ్. ఐటీ మంత్రి దుద్దిల్లా శ్రీధర్ బాబు ని కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. అభివృద్ధిలో వెనుకబాటుకు గత 30 ఏళ్లుగా ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని అన్నారు. జవహర్నగర్ డంపింగ్ యార్డ్ వల్ల ఇక్కడి ప్రజలు తీవ్రమైన దుర్వాసనతో, ఆరోగ్య సమస్యలతో నరకయాతన అనుభవిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సుమారు 3 లక్షలకు పైగా జనాభా ఉందన్నారు. 50కి పైగా కాలనీలు ఉన్నప్పటికీ, ఈ ప్రాంతాన్ని ప్రత్యేక డివిజన్గా గుర్తించకపోవడం వల్ల పాలన పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారాన వ్యక్తపరిచారు. ప్రతినిధుల విన్నపాన్ని సావధానంగా విన్న మంత్రి, ఈ ప్రాంత సమస్యలపై సానుకూలంగా స్పందించారని చెప్పారు. నూతన డివిజన్ల ఏర్పాటు ప్రక్రియలో అంబేద్కర్ నగర్, చెన్నపురం రెండింటిని కలిపి ప్రత్యేక డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదనను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. స్థానిక నాయకులు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రత్యేక డివిజన్ ఏర్పాటైతేనే తమ ప్రాంతానికి నిధులు మంజూరై మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని వారి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గూడెల్లి సురేష ముదిరాజ్, మాజీ ఎంపిటిసి పంతంగి సిద్దులు యాదవ్, దంతూరి శివకుమార్ గౌడ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733